ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ మంగళవారం | 8 ఏప్రిల్ 2025 | ■ 12 పేజీలు

## యాసంగి ధాన్యం
# కొనుగోళ్లకు రెడీ

- దొడ్డు, సన్న రకాలకు వేరు వేరుగా కేంద్రాలు
- సమస్యగా మారనున్న గన్నీ బ్యాగుల సేకరణ
- నేటి నుంచి కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ



8లో

# నామినేటెడ్ పోస్టుల కోసం
# నిరీక్షణ..!

- నామినేటెడ్ పదవులపై నేతల ఆశలు
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎదురు చూపులు
- జిల్లా, నియోజకవర్గ స్థాయి కమిటీల్లో చోటుకు నాయకుల పైరవీలు..
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే పలు వ్యవసాయ మార్కెట్లకు చైర్మన్ల నియామకం
- మిగిలినవి స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే నియామకమా..?!
- నేతల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు





■ ప్రభాతసమాచారం, ప్రత్యేక ప్రతినిధి

నామినేటెడ్ పదవుల కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతలు కళ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో నామినేటెడ్ పదవుల నియామకం చేపట్టలేదు. కేవలం కొన్ని వ్యవసాయ మార్కెట్లకు చైర్మన్లను నియమించారు. దీంతో ఏళ్ల తరబడి పార్టీలో పనిచేస్తున్నా నేటికీ పదవులు దక్కడం లేదనే నైరాశ్యం నెలకొంది. ఎలాగైనా పదవులు దక్కించుకోవాలని ఆశావహులు అధిష్టానం, నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. మంత్రివర్గ విస్తరణ తర్వాత నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. మరో వైపు పార్టీలో పదేళ్లకు పైబడిన సీనియర్లకు పెద్దపీట వేయాలనే ఆలోచనలో పీసీసీ నేతలు ఉన్నట్లు సమాచారం. త్వరలోనే స్థానిక సంస్థల పోరుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్న నేపథ్యంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్ పదవులపైనా చాలా మంది కన్నేశారు. ఈ నేపథ్యంలో టికెట్లు ఆశిస్తున్న వారికి కాకుండా మిగిలిన వారికి పదవులు కట్టబెట్టే ఛాన్స్ ఉందన్న చర్చ జరుగుతోంది. మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఆలయాల కమిటీలతో పాటు నియోజకర్గ, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులపైనే ఆశలు పెట్టుకున్న నేతల నిరీక్షణకు ఎప్పుడు తెరపడేనో వేచి చూడాల్సిందే మరి.



7లో

# బండ బాదుడు

- మళ్లీ పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర
- సిలిండర్‌పై పెంపు రూ.50 ■ నేటి నుంచి అమల్లోకి
- చుక్కలనంటుతున్న కూరగాయల ధరలు..
- పెరిగిన ధరలతో బెంబేలెత్తుతున్న సామాన్యులు



సామాన్యుడికి గ్యాస్ సిలిండర్ మళ్లీ బరువెక్కింది. సోమవారం వంట గ్యాస్ సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం అదనంగా రూ.50 బాదింది. దేశ వ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గృహా వసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ ధరల పెంపు ఉజ్వల పథకం లబ్ధిదారులకు సైతం వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. ఉజ్వల పథకం లబ్దిదారులు ఇప్పుడు ఒక్కో సిలిండర్‌పై చెల్లిస్తున్న దానిపై అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది.

● 7లో

## నెన్నెల తహసీల్దార్
# సస్పెండ్

నెన్నెల తహసీల్దార్ సబ్బ రమేష్‌ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం సస్పెండ్ చేశారు. భూమి విషయంలో అవ్రూలకు పాల్పడిన రమేష్‌ను సస్పెండ్ చేస్తూ, అతనికి సహకరించిన ధరణి ఆపరేటర్ ఉదయ్‌ను తొలగించారు.



5లో

## సింగరేణిలో
# నీటి బింధువు - జల సింధువు

### సింగరేణి వ్యాప్తంగా 50 చెరువుల ఏర్పాటు

- భూగర్భ జలాల పెంపుదలకు సింగరేణి సంస్థ ప్రత్యేక ప్రణాళిక
- పర్యావరణహిత పథకం అమలుకు ప్రణాళికలు సిద్ధం
- సింగరేణి ఆధ్వర్యంలో చెరువుల పూడికతీత పనులు
- సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఏర్పడిన ఖాళీ సంపుల్లో నీటి శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం..
- ఏరియా జీఎంలు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశంలో సింగరేణి సీఎండి బలరాం నాయక్ సూచన..

## మెరుగైన వైద్యసేవలందించాలి



## పదేళ్ల పోరాటంతోనే
# జిల్లాకు ఎయిర్‌పోర్ట్



వివరాలు 12లో

- త్వరలోనే ఎయిర్ పోర్ట్ భూసేకరణ, వసతుల ఏర్పాటు
- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్
- బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే జిల్లాకు రావాల్సిన కేంద్ర ప్రాజెక్టులు రాలేదు..
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్
- పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేయాలి



# అర్జీదారులను ఇబ్బంది పెట్టకుండ
# సమస్యలను త్వరగా పరిష్కరించాలి

**ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**
ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులంతా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అందజేయాలన్నారు. నూతన పథకాలు అమలు, ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఎంపీడీవో కార్యాలయాలలో ఆఫ్ లైన్ విధానంలోనూ దరఖాస్తులను స్వీకరించాలని, దరఖాస్తుదారులకు రసీదును ఇవ్వాలన్నారు. స్వయం ఉపాధికై రాజీవ్ యువ వికాసం పథకానికి అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చేలా అధి కారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సన్నబియ్యం పంపిణీ పథకానికి సంబంధించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. వేసవిలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**టెలిఫోన్ ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్...**
అధిక ఉష్ణోగ్రతల కారణంగా, జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10:30 నుంచి 11:00 గంటల వరకు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజల అర్జీలను ఫోన్ ద్వారా స్వీకరించారు. ప్రజల సమస్యలను విని, సంబంధిత అధికారులకు ఆయా సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. కాగా సోమవారం టెలిఫోన్ ప్రజావాణి ద్వారా 10 మంది దరఖాస్తుదారులు తమ అర్జీలను సమర్పించారు. దరఖాస్తు వివరాలను వాట్సప్ ద్వారా స్వీకరించి. ప్రజావాణిలో సమస్య నమోదుకు సంబంధించి రసీదును సంబంధిత వ్యక్తులకు వాట్సప్ ద్వారా అందించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## నిబంధనలు ఉల్లంఘిస్తే
# చర్యలు తప్పవు
## ఎంఈఓ హెలెన్ దారతి

**లక్సెట్టిపేట, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**
విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘించి పాఠశాలలు నడిపితే చర్యలు తప్పవు అని ఎంఈఓ హెలెన్ దారతి అన్నారు. సోమవారం పట్టణంలోని బ్రిలియంట్ మోడల్ హై స్కూల్‌ను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారని సమాచారంతో స్థానిక ఎంఈఓ హెలెన్ దారతి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ హెలెన్ దారతి మాట్లాడుతూ.. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మార్చి 15 నుంచి అన్ని పాఠశాలలకు ఒంటిపూట బదులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించారు. కానీ పట్టణంలోని బ్రిలియంట్ మోడల్ హై స్కూల్ ప్రైవేటు పాఠశాల యజమాన్యం జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులకు విరుద్ధంగా యధావిధిగా విద్యార్థులకు రెండు పూటల బడిని నిర్వహిస్తున్నారని సమాచారంతో పాఠశాలను తనిఖీ చేసి సిబ్బందిని హెచ్చరించారు. ఇలాంటివి పునరావృతం అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు ఏ పాఠశాల నడుస్తున్న చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని యాజమాన్యాలను హెచ్చరించారు.

# కలెక్టరేట్ ఎదుట 'ఉపాధి' కూలీల ధర్నా

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**
తమకు పని కల్పించాలని ఉపాధి కూలీలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, పావని మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు కావడంతో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో పనిచేసే అవకాశం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి చేస్తే గాని పూట గడవని తమ కుటుంబాలకు తీరని అన్యాయం జరిగిందని అధికారులు స్పందించి పని కల్పించాలని కోరారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కూలీలకు చెందిన జాబ్ కార్డులను రాజంపేట గ్రామ పంచా



యతీలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయకపోతే ఉధృతంగా పోరాటాలు చేస్తామని స్పష్టం హెచ్చరించారు. ఉపాధ్యక్షురాలు స్వరూప, కోశాధికారి మంజుల, సహాయ కార్యదర్శి సుగుణ పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే సన్న బియ్యం



**బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**సారంగాపూర్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**
కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే పేదలకు సన్న బియ్యం సరఫరా జరుగుతున్నదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ రూరల్ మండలం చిట్యాల, దిలావార్‌పూర్, సారంగాపూర్ మండల కేంద్రాల్లో ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా రాష్ట్రంలోని పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేశారు. పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గడిచిన ఐదు సంవత్సరాలుగా కరోనా సమయం నుంచి దేశ వ్యాప్తంగా ఉచిత బియ్యం పంపిణీకి సహకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల రాంనాథ్ , సత్యనారాయణ గౌడ్, ముత్యం రెడ్డి, వీరేష్, జమాల్, మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, నర్సారెడ్డి, నరేష్, నాయకులు మౌలానా, చంద్ర ప్రకాష్ గౌడ్, విలాస్, రాజా రెడ్డి, రాజేశ్వర్, వీరయ్య, సాగర్ రెడ్డి, గంగారెడ్డి, లింగారెడ్డి, తిరుమల చారి, శేఖర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ఇదే కదా మనం
# రావాలనుకున్న మార్పు

- సన్న బియ్యంను సద్వినియోగం చేసుకోవాలి
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఈట్పల్లి గ్రామంలో గిరిజన లబ్ధిదారుడి ఇంట్లో సన్న బియ్యంతో వండిన భోజనాన్ని ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, అదనపు కలెక్టర్ దేవిడ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా అందజేసిన సన్న బియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడారు. సన్న బియ్యం పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుంది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ పథకం ప్రవేశ పెట్టడం శుభపరిణామం అన్నారు. సన్న బియ్యం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలకు ఈ పథకం ప్రయోజనాలు తెలుసుకోవడానికి క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా విస్తృతంగా పర్యటించి సన్న ప్రభుత్వం అందచేస్తున్న బియ్యాన్ని పక్కదోవ పట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. బియ్యం పథకం లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడారు. భోజన సమయంలో కుటుంబంతో ఆత్మీయంగా మమేకమై వారి కుటుంబ పరిస్థితులు, జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ కోసం పాదయాత్ర

**లక్సెట్టిపేట, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**
మండలంలోని పాత కొత్త కొమ్ముగూడెం, మున్సిపాలిటీలోని పలు వార్డులలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, అభియాన్, రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ చిట్ల సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, కలసికట్టుగా పోరాడి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్‌కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం అన్నారు. మహనీయుల ఆశయాలను కాపాడటంతో పాటు ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్ అగ్ర నేత లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్, మండల అధ్యక్షులు ఎండి ఆరిఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణచందర్ రావు, చింత అశోక్ కుమార్,



నాగభూషణం, జిల్లా ఆర్టిఐ మెంబెర్ అంకతి శ్రీనివాస్, జిల్లా యూత్ అధ్యక్షులు అనిల్, పట్టణ యూత్ అధ్యక్షులు రాందేని వెంకటేష్, యూత్ అధ్యక్షులు బొప్పు సుమన్, సందేలా సురేష్, మాజీ కౌన్సిలర్ రాందేని వెంకటేష్, సురేష్ నాయక్, బియ్యల తిరుపతి, మోహన్, రాజు, కాంగ్రెస్ నాయకులు చిన్నాన్న, మండల, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

**లక్సెట్టిపేట, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**



లక్సెట్టిపేట మండల నూతన ఎస్ఐగా గోపతి సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ... మండలంలో నేరాలను అదుపులో ఉంచడానికి, తన వంతు కృషి చేస్తానన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, యువకులు చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై సూచించారు.



# యాసంగి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

- ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- ప్రతీ కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు ఉండాలి..
- సన్నరకం ధాన్యం నిల్వ చేసే గోనె సంచులను ఎర్ర రంగు దారంతో, దొడ్డురకం ధాన్యం నిల్వ చేసే గోనె సంచులను ఆకుపచ్చ రకం దారంతో కుట్టాలి
- జిల్లా వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్షా సమావేశంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ ఆదేశాల మేరకు వరిధాన్యం కొనుగోలు కొరకు రైతులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి జిల్లా గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా, మార్కెటింగ్ శాఖల అధికారులు, మెప్మా అధికారులతో కలిసి యాసంగి 2024-25 వరిధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు రైతుల వద్ద నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. యాసంగి 2024-25 సంవత్సరానికి గాను గ్రేడ్ ఎ రకానికి 2 వేల 320 రూపాయలు, సాధారణ రకానికి 2 వేల 300 రూపాయలు మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. వేసవి అయినందున నీడ, తాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు ఓ.ఆర్.ఎస్., మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. తూకము చేయడానికి వినియోగించే కాంటా, బాట్లు, తేమ శాతాన్ని పరిశీలించే మాయిశ్చర్ మీటర్, ప్యాడీ క్లీనర్లు, డిజిటల్ మైక్రో మీటర్, గన్నీ సంచులు సమకూర్చుకోవాలని, అకాల వర్షాల నుండి ధాన్యాన్ని రక్షించుకోవడానికి అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో కనీసం 25 టార్పాలిన్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ధాన్యం తూకం చేయడానికి ముందే సంబంధిత రైతు వద్ద నుండి కూపన్, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకలు ప్రతులను తీసుకోవాలని, ఇట్టి వివరాలను ట్యాబ్లో నమోదు చేసి ధాన్యం కొనుగోలు చేసి రశీదు జారీ చేయాలని తెలిపారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేయడం జరుగుతుందని, కొనుగోలు వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్లో నమోదు చేయాలని తెలిపారు. కేంద్రానికి వచ్చిన గన్నీ సంచులను సరి చూసుకొని రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు వివరాలను ప్రతి రోజు ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి ట్యాగింగ్ చేయబడిన రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. సన్నరకం ధాన్యం నిల్వ చేసే గోనె సంచులను ఎర్ర రంగు దారంతో, దొడ్డురకం ధాన్యం నిల్వ చేసే గోనె సంచులను ఆకుపచ్చ రకం దారంతో కుట్టువేయాలని, సన్నరకం ధాన్యం నింపే గోనె సంచులను 'ఎస్' అని ముద్రించడంతో పాటు కొనుగోలు కేంద్రం కోడ్ వ్రాయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు నీరు నిల్వ లేని ఎత్తైన ప్రదేశాలలో వాహన రాకపోకలకు అనువుగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో కేంద్రం పేరు, కోడ్, మద్దతు ధర, నాణ్యత ప్రమాణాలతో కూడిన ప్లెక్సీ ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతులు కల్లాలలో ధాన్యాన్ని ఆరబెట్టి తప్ప, తాలు, మట్టిగడ్డలు లేకుండా నిబంధనల ప్రకారం పరిశీలించుకొని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కౌలు రైతులు పట్టేదారుతో కలిసి సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న తరువాతనే కొనుగోలు కేంద్రాలకు రావాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు ప్రక్రియకు కావలసిన తూకం యంత్రాలు, తేమ శాతం మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లను తీసుకోవాలని, వ్యవసాయ శాఖ పరిధిలో సన్నరకం, దొడ్డురకం గుర్తించి ధృవీకరణ పత్రం అందించాలని, పంట కోత సమయంలో హార్వెస్టర్ నియంత్రణ వ్యవసాయ విస్తరణ అధికారులు చేపట్టడంతో పాటు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తూనికలు, కొలతల శాఖ ద్వారా పరీక్షించబడి ధృవీకరించబడిన తూకం యంత్రాలను మాత్రమే కొనుగోలు ప్రక్రియలో వినియోగించాలని, కొనుగోలు కేంద్రాలలో మాన్యువల్ తూకం జరుగకుండా డిజిటల్ తూకం యంత్రాల ద్వారా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఐ.కె.పి. ఆధ్వర్యంలో 104 దొడ్డు రకం, 90 సన్నరకం కొనుగోలు కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 80 దొడ్డురకం, 39 సన్నరకం, మెప్మా ఆధ్వర్యంలో 4 దొడ్డు రకం, 2 సన్నరకం కొనుగోలు కేంద్రాలతో మొత్తం 319 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. బ్యాంక్ గ్యారంటీ ఇచ్చిన వారికి, సి.ఎం.ఆర్. డెలివరీ సకాలంలో చేసిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయింపు జరుగుతుందని తెలిపారు. గన్నీ సంచుల నిర్వహణ పక్కదారి పట్టకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, కొనుగోళ్లలో ఎటువంటి పొరపాట్లను తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నా రు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య సభ్యులు, ఎపిఎంలు, సి.సి.లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శులు, పర్యవేక్షక అధి కారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# 'నా భూమిని నాకు ఇప్పించండి సారూ'

## ప్రజావాణిలో బాధితురాలు విజ్ఞప్తి

**మందమర్రి, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

రెండు సంవత్సరాలు క్రితం తన భూమిని కబ్జా చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తన భూమిని తనకు ఇప్పించాలని పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన మంద పద్మ ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసింది.. గత మూడు సంవత్సరాల క్రితం మండలంలోని సారంగపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 205లో మూడున్నర గంటల భూమిని ఆవుల రమేష్ అనే వ్యక్తి నుండి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకుంది. స్థలం చుట్టూ సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పిచ్చి మొక్కల తొలగింపు పనులను గ్రామ మాజీ సర్పంచ్ భర్త ఫిరోజ్ చేపట్టి పిచ్చి మొక్కలను తొలగించడంలో భాగంగా గ్రామంలోని రోడ్డును ఆనుకొని ఉన్న తన భూమిలో ఉన్న పిచ్చి మొక్కలతో పాటు హద్దు రాళ్ళను తొలగించి భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. గత మూడు సంవత్సరాలుగా రమేష్ మాజీ సర్పంచ్ భర్త ఫిరోజ్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సతీష్ మాట్లాడుతూ బాధితురాలి వినతిపత్రంపై సమగ్ర విచారణ జరిపించి తగిన న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుని అరెస్ట్



**బెల్లంపల్లి, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి రెండవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడైన గజానంద్ పార్ధీ (45)ని పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బెల్లంపల్లి ఏసిపి ఏ. రవికుమార్ సోమవారం బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయంలో వెల్లడించారు. గత నెల 29న రాత్రి బెల్లంపల్లి పట్టణంలోని కాల్టెక్స్ ప్రాంతంలో సాన శ్రావణ్ అనే వ్యక్తి ఇంట్లో తలుపులు పలుగగొట్టి ఇంట్లో ఉన్న 14.5 తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ 20 వేల నగదుతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు అట్టే సుధాకర్ ఇంట్లో 5 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడు శ్రావణ శ్రావణ్‌కు చెందిన బైకుతోపాటు అదే కాలనీలో నిలిపి ఉంచిన మరో 3 బైకులను ఎత్తుకెళ్లారని చెప్పారు. తమ ప్రాథమిక విచారణలో దొంగతనం పార్ధీ గ్యాంగ్ అని తేలడంతో మూడు ప్రత్యేక పోలీసు దర్యాప్తు ఏర్పాటుచేసి బల్లార్ష, చంద్రపూర్, మహారాష్ట్ర ప్రాంతాలలో గాలించగా నిందితులకు సంబంధించిన ఆధారాలు లభించినట్లు ఏసిపి రవికుమార్ తెలిపారు. దర్యాప్తులో భాగంగా గాలింపు జరుపుతుండగా సోమవారం బెల్లంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మధ్యప్రదేశ్ రాష్ట్రం, గుణా జిల్లా, కనేర గ్రామానికి చెందిన గజానంద్ పార్ధీ అనే అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యున్ని పట్టుకున్నట్లు చెప్పారు. 12 మంది పార్ధి గ్యాంగ్ సభ్యులు బెల్లంపల్లిలో రెక్కీ చేసుకొని దొంగతనం చేసి రైల్వే స్టేషన్‌కు బైకులపై వెళ్లినట్లు చెప్పారు. బెల్లంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో బైకులను దాచి ఉంచి అక్కడి నుండి రైల్లో కాజీపేట వెళ్లి 31న మరో దొంగతనం చేసినట్లు చెప్పారు. గత నెల 31న దాచిన బైకులను తీసుకెళ్లేందుకు బెల్లంపల్లికి వచ్చి పోలీసులకు పట్టుబడ్డట్లు తెలిపారు. 15 మంది గ్యాంగ్ సభ్యులు కాజీపేటలో దొంగతనం చేసినట్లు పట్టుబడ్డ గజానంద్ పార్ధీ అంగీకరించినట్లు చెప్పారు. తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ ప్రాంతాలలో ఈ ముఠా సభ్యులు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఏసీబీ రవికుమార్ వెల్లడించారు. తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులకు కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో ముమ్మరంగా గాలిస్తున్నట్లు చెప్పారు. పట్టుబడ్డ అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడు గజానంద్ పార్టీ వద్ద నుండి 4 బైక్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బైకుల విలువ రూ లక్ష వరకు ఉంటుందన్నారు. అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడిని పట్టుకున్న బెల్లంపల్లి రూరల్ సీఐ సయ్యద్ అఫ్జలొద్దిన్, టూ టౌన్, నెన్నల్ ఎస్సైలు రమేష్, మహేందర్, ప్రసాద్‌లను ఏసీపి రవికుమార్ అభినందించారు.

# ఉద్యోగాల భర్తీ కోసం 8న ఎన్రోల్మెంట్ డ్రైవ్

**మంచిర్యాల, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్కామ్), తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాక క్రింద రిజిస్టర్డ్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ ద్వారా అర్హత, నైపుణ్యం కలిగిన, సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశాలలో ఉద్యోగాల భర్తీ కొరకు ఈ నెల 8న జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఐ.టి.ఐ. కళాశాలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సిరామిక్ కాస్టర్, జూనియర్ ప్రాసెస్ ఆపరేటర్, ప్రెస్ మెకానిక్, పాలిషింగ్ మెకానిక్, డిజైనర్, ప్రొడక్షన్ సూపర్వైజర్, బాడీ ప్రిపరేషన్ ఇన్చార్జ్, ఫోర్క్లిఫ్ట్ ఆపరేటర్, షావెల్ ఆపరేటర్ లకు యు.ఎ. ఈ. లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు 18-40 సం?ల మధ్య వయస్సుతో పాటు అర్హతలు కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు డయోడేటను tomcom.resume@gmail.comకి పంపాలని, వివరాల కొరకు www.tomcom.telangana. gov.in వెబ్‌సైట్‌లో, 9440049937, 9440049861, 9440051452 నంబర్లలో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# హనుమాన్ ఆలయంలో అన్నదానం

**మందమర్రి, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని పాలచెట్టు ఏరియాలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో హనుమాన్ మాలధారణ స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పట్టణానికి చెందిన చెప్పాల రమేష్-జ్యోతి దంపతుల 31వ పెళ్లి రోజు సందర్భంగా హనుమాన్ స్వాములకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణకాంత్ ఆచార్యులు, హనుమాన్ స్వాములు భక్తులు పాల్గొన్నారు.



# శ్రీ రామ పట్టాభిషేకం

**సారంగాపూర్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

మండలంలోని జామ్ గ్రామంలోగల సీతా రామ ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి రామ కృష్ణమాచార్యులు, కార్తీక్ఆచార్యులు వేద మంత్రోచ్ఛనలతో ఆదివారం రామనవమి సందర్భంగా శ్రీ సీత రాముల కళ్యాణ మహోత్సవం సోమవారం శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. రాత్రి గరుడవాహన పల్లకి సేవ.అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# బీజేపీ ఆవిర్భావ వేడుకలు



**మందమర్రి, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

మండలంలోని సారంగపల్లి గ్రామపంచాయతీలో బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిజెపి నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ 1980 సం,,లో ఆవిర్భవించిందన్నారు. నాటి నేటి వరకు అంచెలంచెలుగా ఎదుగుతూ దేశంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో పార్టీ ముందుకు దూసుకు పోతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో కాషాయ జెండా రెపరెపలాడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఉపసర్పంచ్ ధారవేణి రవి కుమార్, బిజెపి గ్రామ అధ్యక్షులు దశరథం గౌడ్, నాయకులు దుర్గం మల్లేష్‌లు పాల్గొన్నారు.

# హనుమాన్ స్వాములకు భిక్ష



**బెల్లంపల్లి, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కన్నాల శ్రీ బుగ్గ రాజా రాజేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం హనుమాన్ స్వాములకు బుగ్గగూడెం గ్రామానికి చెందిన దాత ప్రణయ్ కుటుంబ సభ్యులు భిక్ష ఏర్పాటు చేశారు. బుగ్గ దేవాలయం ప్రాంతంలోని హనుమాన్ మందిర్‌లో హనుమాన్ స్వాములు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆంజనేయునికి నైవేద్యం సమర్పించి బిక్షలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన

# ఇద్దరిపై కేసు నమోదు

**బెల్లంపల్లి, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని షంషీర్ నగర్ ఏరియాలో ప్రభుత్వ భూవిధి ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్న అదే బస్తీకి చెందిన మెహబూబీ షేక్, అమానుల్లా ఖాన్ లపై సోమవారం కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఎస్హెచ్ఓ దేవయ్య తెలిపారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

# ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

**మంచిర్యాల, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

పేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు బ్లడ్ క్యాన్సర్ బారిన పడడంతో అల్లాడుతున్నది. ప్రాణాంతక రోగానికి చికిత్స చేయించేందుకు లక్షల్లో ఖర్చువుతుందని తెలిసి ఆందోళన చెందుతున్నది. అయినా కొడుకును బతికించుకునేందుకు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నది. వివరాల్లోకి వెళితే.. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ అలీ.. స్థానికి ఆర్డీవో ఆఫీసులో హోంగార్డుగా పని చేస్తున్నాడు. ఇద్దరు కొడుకులు కాగా, పెద్ద కొడుకు కరీం (21) గతేడాది చదువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. అనారోగ్యంతో పాటు తరచూ జ్వరం వస్తుండడంతో మంచిర్యాలకు తీసుకువచ్చి, స్థానికంగా చూపించారు. ఎంతకీ జ్వరం తగ్గకపోవడంతోపాటు ప్లేట్‌లెట్లు తగ్గిపోవడంతో వైద్యుల సలహాపై పరీక్షలు చేశారు. బ్లడ్ క్యాన్సర్ అని తేలింది. ప్రస్తుతం చికిత్స కోసం హైదరాబాద్‌లోని బసవతారకం దవాఖానలో చికిత్స తీసుకుంటున్నాడు. కాగా, చికిత్సకు రూ.15 లక్షలపైగా అవసరమవుతుందని తెలియడంతో ఆ కుటుంబం ఆందోళన చెందుతున్నది. కనీసం సొంత ఇల్లు కూడా లేని తమకు, కొడుకు ను ఎలా బతికించుకోవాలో తెలియని సందిగ్ధంలో పడిపోయింది. ఇప్పటికే శక్తికి మించి అప్పు చేసి, రోజూ చికిత్స చేయిస్తున్న ఆ కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నది. తోచిన



సాయం చేయాలని వేడుకుంటున్నది. అందుకు 98660 34012, 93812 15299 నంబర్లకు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సాయం అందించాలని కోరుతున్నది.

# లబ్ధిదారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**గుడిహత్నూర్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

ఎన్నికల సమయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం గుడిహత్నూర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 50 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలి




**మందమర్రి, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ టీచర్లకు ఆయాలకు కనీస వేతనం 18వేల రూపాయలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ కరుణ కుమారి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఏఐటియుసి యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమా వేశంలో నాలుగు సెంటర్లకు చెందిన సుమారు వందమంది అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ఏఐటీయూసి (అంగన్వాడీ) యూనియన్‌లో చేరారు. వీరికి ఏఐ టియుసి (అంగన్వాడీ) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణకుమారి యూనియన్ కండువాలు కప్పి, సాదరంగా యూనియన్ లోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రాలకు పాఠశాలలకు సమానంగా ఒక పూట బడి, వేసవి సెలవులు అమలు చేయాలన్నారు. జూలై, 2024 లో అంగన్వాడి టీచర్లు, ఆయాలను రిటైర్డ్ చేశారని, ఇంత వరకు వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదన్నారు. తక్షణమే టీచర్‌లకు రెండు లక్షల రూపాయలు, ఆయాలకు లక్షరూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేస్తూ జీవో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, అదే విధంగా విధుల్లో ఉండి చని పోయిన వారికి సైతం రిటైర్మెంట్ అయిన వారితో సమానంగా బెనిఫిట్స్ అందజేయాలన్నారు. 20 సంవత్సరాల కిందట ఇచ్చిన గ్యాస్ పొయ్యిలు, కుక్కర్లు, వంటసామాగ్రి పాడైపోయాయని, అంగన్వాడీ సిబ్బంది వాటిని తమ సొంత ఖర్చుతో రిపేరు చేసుకున్నారని, వెంటనే అంగన్వాడీ సిబ్బందికి గ్యాస్‌స్టవ్‌లు, కుక్కర్లు, వంట సామగ్రి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కలీందర్, ఏఐటియుసి అంగన్వాడీ జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి, సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గారాజ్‌లు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల సరఫరాను అరికట్టాలి



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు అక్రమార్కులు అడ్డదారిలో డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో నకిలీ పత్తి విత్తనాలను అమాయక రైతులకు అంటకడుతున్నారన్నారు. మే, జూన్ నెలలోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తారని జిల్లా పోలీస్ యంత్రాంగం ఎక్కడికక్కడ వాహనాలు తనిఖీలు పకడ్బందీగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేయడంతో పాటు గ్రామ స్థాయిలో కార్డన్ సెర్చ్‌లు చేపట్టి అక్రమాలను అరికట్టాలని కోరారు. నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్, పోలీసులు, వ్యవసాయ అధికారులు నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టాలని కోరారు. ఇప్పటి గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొట్టుపల్లి సాయికృష్ణ, పిప్పిరి సమ్మన్న, టోబ్రే శ్రీకాంత్, నరేష్ తదితరులు ఉన్నారు.



## శిశు మందిరాల్లో

# సీబీఎస్ఈ సెలబస్

### ఆదిలాబాద్‌లో భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన విద్యాపీఠం ప్రాంత సంఘటన మంత్రి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిరాల్లో ఇకపై సీబీఎస్ఈ సెలబస్ అందుబాటులోకి రానుంది. ఇందులో భాగంగానే ఆదిలాబాద్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో సీబీఎస్ఈ కోసం నూతన భవన నిర్మాణానికి శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్, ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లతో కలిసి సోమవారం భూమి పూజ చేశారు. అటు శిశు మందిరాల ద్వారా విద్యార్థులకు సంస్కారంతో పాటు దేశభక్తిపై విలువలను తెలియజేస్తునే మారుతున్న కాలానుగుణంగా సీబీఎస్ఈ సెలబస్ ను ప్రారంభించనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు సుహాసిని రెడ్డి మాజీ కౌన్సిలర్ అశోక్, పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అదిలాబాద్ బస్టాండ్‌లో ఉర్దూలో

# బోర్డులు ఏర్పాటు చేయాలి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ బస్టాండ్‌లో బస్సులు వెళ్లే మార్గాలను సూచించే బోర్డులు ఉర్దూలో లేక పోవడం వల్ల ఉర్దూ మాట్లాడే, చదివే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు శేఖ్ ఫెరోజ్ అహ్మద్, అమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అరఫత్ ఖాన్ లు సోమవారం జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఆదిలాబాద్ జిల్లాలో ఉర్దూ మాట్లాడే వారి ఎక్కువ ఉందని, జిల్లా ప్రజలే కాకుండా మహారాష్ట్ర వారు కూడ ఆదిలాబాద్ బస్ స్టాండ్ నుంచి ప్రయాణాలు సాగిస్తారని వారు కలెక్టర్‌కు వివ రించారు. బస్ స్టాండ్లఓ అన్ని భాషలతో పాటు బోర్డుల్లో ఉర్దూ భాషను కూడ చేర్చాలని వారు కలెక్టర్‌ను కోరారు.





# సింగరేణిలో నీటి బింధువు - జల సింధువు



- సింగరేణి వ్యాప్తంగా 50 చెరువుల ఏర్పాటు
- భూగర్భ జలాల పెంపుదలకు ప్రత్యేక ప్రణాళిక
- పర్యావరణహిత పథకం అమలుకు ప్రణాళికలు సిద్ధం
- సింగరేణి ఆధ్వర్యంలో చెరువుల పూడికతీత పనులు
- సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఏర్పడిన ఖాళీ సంపుల్లో నీటి శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలి
- ఏరియా జీఎంలతో, అధికారులతో సమీక్షలో సింగరేణి సీఎండి బలరాం నాయక్ వెల్లడి

**మంచిర్యాల, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)** సింగరేణి వ్యాప్తంగా 50 చెరువులను ఏర్పాటు చేయాలని, భూగర్భ జలాలను పెంపొందించుటకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని సీఎండి బలరాం నాయక్ అన్నారు. సోమవారం హైదరాబాదులోని సింగరేణి భవన్‌లో సింగరేణి నీటి బింధువు - జల సింధువు అనే కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. రెండు కిలోమీటర్ల పరిధిలో సహజ చెరువులు, కుంటల్లో నీటి నిల్వకు చర్యలు, జీవావరణ వృద్ధికి, జలచరాలు, పశుపక్ష్యాదుల పెరుగుదలకు అందరం పాటుపడాలన్నారు. పర్యావరణహిత మైనింగ్‌ను పాటిస్తూ, కోట్లాది మొక్కలను నాటి దేశవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకున్న సింగరేణి సంస్థ, సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాల అభివృద్ధికి సంస్థ ముందుంటుందన్నారు. పంటలకు ప్రాణప్రదమైన నీటి విలువను గుర్తిస్తూ, మైనింగ్ ప్రాంతంలోనూ, ప్రాంతానికి వెలుపల రెండు కిలోమీటర్ల పరిధిలోను 50 మినీ చెరువులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. చెరువులలో పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. వీడియో సమీక్ష సమావేశంలో సీఎండీ ఎన్.బలరాం ఏరియా జీఎంలతో, అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. జలవనురుల వృద్ధికి కొన్ని మార్గదర్శకాలను ఖరారు చేశారు. సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాలను పెంచడం కోసం, సమీప గ్రామాల ప్రజలకు ఎండాకాలంలో సైతం స్వచ్ఛమైన తాగునీరు అందించడం కోసం సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని, జల వనరుల పెంపుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. సింగరేణి చేపట్టనున్న చర్యల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని, తాగునీరు, సాగునీటి అవసరాలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటికే బొగ్గు తవ్వగా ఏర్పడిన ఖాళీ సంపుల్లో నీటి శాతాన్ని పెంచాలని, తద్వారా సమీప ప్రాంతాల్లో వాటర్ లెవెల్ వృద్ధి చేయాలని నిర్ణయించారు. ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ డంపుల మధ్య ఏర్పడే లోతట్టు ఖాళీ ప్రదేశాలను ఇకపై చిన్నపాటి నీటి తటాకాలుగా తీర్చిదిద్దాలని, వీటిని వర్షపు నీటితో, ఓపెన్ కాస్ట్ నుండి బయటకు పంపించే నీటితో నింపాలని భావిస్తున్నారు. జల వనరు కేంద్రాల లోనికి నీరు చేరడానికి, చేరిన నీరు బయటకు పంపించి సద్వినియోగం చేయడానికి కొన్ని సివిల్ నిర్మాణపు పనులు కూడా శాఖాపరంగా చేపట్టాలని నిర్ణయించారు. సింగరేణి గని ప్రాంతాలకు వెలుపల 2 కిలోమీటర్ల పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను కూడా అభివృద్ధి చేయాలని, వాటిలో ఎక్కువ నీరు నిలవ ఉంచేందుకు పూడిక తీయడం వంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు. స్థానిక గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల అంగీకారాన్ని పొంది, ఈ పనుల్లో స్థానికులు పాల్గొనేలా చూడాలని నిర్ణయించారు. సింగరేణి ప్రాంతంలో భూమి లోపల నీటి ఫలకం పెరిగి జలవనరులు వృద్ధి చెందుతాయని, తాగునీరు, సాగునీటికి వినియోగించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జల వనరుల పెంపుదలకు మాత్రమే కాక ఆ ప్రాంత జీవావరణ పరిరక్షణ కూడా ఉపయోగపడతాయని, వీటిలో చేపలు, కప్పలు వంటి జలచరాలను కూడా వృద్ధి చెందుతాయన్నారు. జల వనరుల కేంద్రాలలోని నీటిని శాస్త్రీయంగా ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ నాణ్యత పెంపుదలకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ సూచన మేరకు సింగరేణి సంస్థ ఈ భారీ పర్యావరణహిత పథకాన్ని అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈఅండ్ఎం), ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పా,పిఅండ్‌పి), హైదరాబాద్ కార్యాలయం నుండి ఈడీ (కోల్ మూమెంట్) ఎస్ డి ఎం.సుభానీ, ఫారెస్ట్ అడ్వైసర్ మోహన్ పరిగెన్ పాల్గొన్నారు.





# ఆరోగ్య సంరక్షణ అందరి బాధ్యత

**'ఆరోగ్యకరమైన ఆరంభాలు - ఆశాజనక భవితవ్యాలు' అనే నినాదంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు**

**శిశుమరణాలను నియంత్రించేందుక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ బలోపేతం - మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా "ఆరోగ్యకరమైన ఆరంభాలు - ఆశాజనక భవితవ్యాలు" అనే నినాదంతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కార్యక్రమ గోడప్రతులను జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా? హరీష్ రాజ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, ముఖ్య ప్రణాళిక అధికారి జి. సత్యం, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1948 ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటు చేయబడినందున ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పునరుత్పత్తి శాతం తగ్గుతుందని, ఈ పరిస్థితి ఆందోళన స్థాయిలో ఉన్నందున మాతా శిశు సంరక్షణ అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకొని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. తల్లి-బిడ్డ లను ఒకే యూనిట్గా తీసుకొని సేవలు అందించాలని, దేశ సుస్థిర, సుసంపన్న భవిష్యత్తు నిర్మాణానికి, మానవ జాతి మనుగడకు తల్లి-బిడ్డలు అత్యవసరమని, మాతృ, నవజాత శిశువులు, 5 సం?ల లోపు పిల్లల మరణాలను తగ్గించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నాణ్యమైన ప్రసూతి సంరక్షణ, స్త్రీకి సురక్షిత గర్భధారణ, ఆరోగ్యకరమైన ప్రసవం ప్రాథమిక హక్కులు అని, ఆరోగ్యంగా పుట్టిన బిడ్డ ఆరోగ్యకరమైన వారిగా, యువతగా మనకు కనిపిస్తుందని, ఒక దేశం అభివృద్ధి చెందిందని చెప్పే ప్రాతిపదిక ఆ దేశపు శిశు మరణాల రేటుపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం, ఆరోగ్య కార్యకర్తలకు, వైద్యులకు శిక్షణ అందించడం, అందుబాటులో ఆరోగ్య కేంద్రాలు, నాణ్యమైన ప్రసవ పూర్వ సేవలు, గర్భిణీగా ఉన్నప్పుడు 16-22 వారాల మధ్య టిఫా స్కాన్ చేయడం ద్వారా గర్భస్థ పిండం పెరుగుదల, సమస్యలను ముందుగా గుర్తించవచ్చని, జిల్లాలో అల్ట్రాసౌండ్, రక్త, మూత్ర పరీక్షలు, రక్తపోటు, రక్తంలో చక్కర శాతం, హెచ్.బి., ఎ.జి., హెచ్.ఐ.వి. పరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రసవం అనంతరం వైద్య సేవలు అందిస్తున్నామని, నవజాత శిశువు సంరక్షణ కోసం పుట్టిన వెంటనే వీలైనంత త్వరగా తల్లి పాలు అందించడంతో పాటు బిడ్డ శరీర ఉష్ణోగ్రత కాపాడటం, బొడ్డు తాడు సంరక్షణ చర్యలు చేపడుతూ చిన్న పిల్లల వైద్య నిపుణుల ద్వారా సేవలు అందిస్తున్నామని అన్నారు. కుటుంబ నియంత్రణలో మహిళలు తమ పునరుత్పత్తి, ఆరోగ్యం గురించి సమాచారంతో పాటు కుటుంబ నియంత్రణ సేవలు కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. మాతా శిశు సంరక్షణలో దేశంలో తెలంగాణ, రాష్ట్రంలో మంచిర్యాల జిల్లా ముందు స్థానంలో ఉందన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్త, సురక్షిత మాతృత్వం కార్యక్రమాల ద్వారా సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం, సిజేరి యన్లను తగ్గించడం, నవజాత శిశు సంరక్షణ కోసం ప్రత్యేక ఎస్.ఎన్.సి.యు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం, హైరిస్క్ గర్భవతులను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు అనిత, ప్రసాద్, కృపాబాయి, సీతారామరాజు, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



■ బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒక్కటే ■ గులాబీ యువ కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలి
■ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

**బెల్లంపల్లి, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని ఈ రెండు పార్టీలు కలిసి తెలంగాణ ప్రజలకు ప్రధాన శత్రువులుగా మారి, తీరని అన్యాయం చేస్తున్నాయని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో సోమవారం సాయంత్రం బిఆర్ఎస్ నియోజవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం విషయంలో అసలు పట్టింపు లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ అభివృద్ధిని పక్కనపెట్టి అధికార దుర్వినియోగాన్ని పాల్పడుతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులకు పాల్పడుతున్నదని విమర్శించారు. అక్రమంగా కేసులు పెడితే చూస్తూ ఊరుకోమన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉండి జిల్లాలో గులాబీ సైనికులుగా పనిచేస్తానన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కేసులకు, అక్రమ అరెస్టులకు, జైల్లు కొత్తేమీ కాదని, పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా మారి సమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. అక్రమ కేసులపై మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో రామగుండం కమిషనరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈనెల 27న వరంగల్ జిల్లాలో బిఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, నియోజవర్గ అన్ని మండలాల ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్‌లో...**

ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. సోమవారం క్యాతన్‌పల్లి సుమన్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ మహాసభ విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువ కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తేనే సభ విజయవంతం చేయడం చాలా సులువవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమ అభివృద్ధిని పక్కనపెట్టి అధికార దుర్వినియోగం చేస్తున్నారని ఎండగట్టారు. బిఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ డా.రాజరమేష్, మాజీ జడ్పిటిసి వేల్పుల రవి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కంబాగోని సుదర్శన్, రవీందర్, మాజీ కౌన్సిలర్లు, జైపూర్ మండల అధ్యక్షుడు అరవిందర్ రావు, మేడి తిరుపతి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.





### అడవిపందులను తరలిస్తున్న
## నిందితుల పట్టివేత

**ముధోల్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

అక్రమంగా అడవి పందులను వేటాడి తరలిస్తున్న పలువురిని ముధోల్ సరిహద్దు ప్రాంతంలో పట్టుకున్నట్లు భైంసా అటవీ అధికారులు తెలిపారు. అటవీ అధికారులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి మహారాష్ట్రలోని నాందేడ్ సరిహద్దుల నుండి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు తరలిస్తున్న 13 పందులను పక్కా సమాచారం మేరకు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురిని రేపు కోర్టులో హాజరు పరుస్తామని అధికారులు వెల్లడించారు. గత కొంత కాలం ఆంధ్ర నుంచి వచ్చిన కొంత ఇక్కడి పంట పొలాల్లో అడవీ పందులకు ఉచ్చులు బిగించి వేటాడుతున్నారు.



## నేటి నుంచి పొన్కల్‌లో లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



**మామడ, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పొన్కల్ లక్ష్మీ వెంకటే శ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భం గా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ఐదు రోజులపాటు సాగే యజ్ఞం కోసం యాగశాలను సిద్ధం చేశారు. ఏప్రిల్ 8 వతేదీన విష్ణు సహస్రనామ పారాయణం, పుణ్యాహవా చనం, అంకురార్పణ, బుధవారం ధ్వజారోహణ, గరుడ పెండ్లి, అగ్ని ప్రతిష్ట, గురువారం పూర్ణాహుతి, శ్రీదేవి భూదేవి కల్యాణం, అన్నదానం శుక్రవారం నిత్యాహోవనం, తెప్పోత్సవం, శనివారం రథోత్సవం, దేవతా ఉద్వాసన, నాగవెల్లి, ఏకాంత సేవ తదితర కా ర్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు విజ య సారథి, రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్ప రవీందర్ రెడ్డిలు పేర్కొన్నారు. బ్రహ్మండ నాయకుడి బ్ర హ్మోత్సవాలలో గ్రామానికి చెందిన 100 మంది భక్తులు వెంకన్న స్వామి సేవలో పాల్గొననున్నా రు. అలాగే ఈనెల 19న ఆలయ సమీపంలో పూడ్చిన కోనేరును మరల తెరువనున్నారు. గత 500 సంవత్స రాల చరిత్ర గల కోనేరు మరల పూడికతీత తీస్తుండడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆ లయ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

**బోథ్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

బోథ్ మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన అజిడే నానక్ సింగ్ అనే రైతుకు చెందిన ఇల్లు సోమవారం ప్రమాదవశాత్తు కాలిపోయిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రైతు ఉంటున్న ఇంటికి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరగడంతో నిల్వ ఉన్న పండించిన పంటలు క్వింటాల కొద్దీ జొన్నలు, తోహర్లు, మక్కలు, గోధుమలు, ధనియాలు,నువ్వులు, శనగలు పూర్తిగా కాలి పోయాయని, సోలార్‌లు, స్ప్రింక్లర్‌లు, పదుల సంఖ్యలో పైపులు, పారీలు, పంటకు పిచికారి చేసే మందు డబ్బాలు, వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు, ఇంటి సామాను, వెండి, బంగారం కూడా కాలి బూడిద అయ్యాయని తెలిపారు. బాధితులు మాట్లాడుతూ లక్షల్లో ఆస్థి నష్టం జరిగిందని, కట్టుబట్టలతో మిగులామని ప్రభుత్వం న్యాయం చేసి తమని ఆదుకోవాలని కోరారు.






## మళ్లీ అధికారం బీఆర్ఎస్‌దే

### ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి బిఆర్ఎస్ పార్టీ వస్తుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభ పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అదిలాబాద్ మాజీ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్‌తో కలిసి నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల కు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 27న పార్టీ రజతోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని సభ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కంకణ బదులు కావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఇప్పటి వరకు సాధించింది ఏమీలేదని, ప్రజలు ఇప్పుడే రేవంత్ పాలనను, నియోజకవర్గాలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వ్యతిరేకిస్తున్నారన్నారు. బీజేపీ ఎంపీలు కూడా రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. కార్యక్ర మంలో నాయకులు మర్సుకోల సరస్వతి, అబ్దుల్ కలాం, రవీందర్, జగదీష్, సందీప్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలపై అవగాహన

**బోథ్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

సోనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బాల్య వివాహ ముక్త్ భారత్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ పిల్లలు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవలను విని యోగించుకోవాలని వారి హక్కులకు ఎటువంటి భంగం కలిగిన 1098 నెంబర్ కు కాల్ చేయాలని, ఫోన్ చేసిన వారి నెంబర్ ను చాలా గోప్యంగా ఉంచబడుతుందని తెలిపా రు. పిల్లలందరూ చదువుపై శ్రద్ధ ఉంచి మిగతా విషయాలన్ని టిని పక్కనపెట్టి సమాజంలో ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని కోరారు.అదే విధంగా ప్రధానమంత్రి గారు ఇచ్చిన పిలుపుమేరకు భారతదేశాన్ని బాల్య వివాహ ముక్త భారత్‌గా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచిన్, మధుసూదన్, పాల్గొన్నారు.

# ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారు

### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

బాలికలు సకాలంలో పోషక ఆహారం తీసుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల ఉన్నత పాఠశాలలో మహిళ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పింకీస్ ఫౌండేషన్ సహకారంతో నవి సమ్మన్ ప్రాజె క్టు కింద ఏర్పాటు చేసిన బాలికలకు సానిటరీ నాప్కిన్స్ పంపిణీ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, పింకీ స్ ఫౌండేషన్ మేనేజర్ భార్గవి బట్నగర్, కార్యదర్శి పండిట్ శాలిని గుప్తా, అధ్యక్షులు అరుణ్ గుప్తాలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సకాలంలో పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువు లో, క్రీడారంగంలో, ఎంచుకున్న రంగాలలో రాణించవచ్చని తెలిపారు. పింకీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 35 పాఠశాల లను సానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థినులు ఆరోగ్యం, పరిశుభ్రత, పారిశుద్ధ్య సూత్రాలను పాటించాలని, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువులో రాణించాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రే జిల్లాలోని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజలు అందజేస్తున్న సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారు లు సమన్వ యంతో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



- నామినేటెడ్ పదవులపై నేతల ఆశలు
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎదురు చూపులు
- జిల్లా, నియోజకవర్గ స్థాయి కమిటీల్లో చోటుకు నాయకుల పైరవీలు..
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే పలు వ్యవసాయ మార్కెట్లకు చైర్మన్ల నియామకం
- మిగిలినవి స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే నియామకమా..?!
- నేతల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

# నామినేటెడ్ పోస్టుల కోసం

# నిరీక్షణ..!





- ప్రభాతసమాచారం, ప్రత్యేక ప్రతినిధి

**నామినేటెడ్ పదవుల కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతలు కళ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో నామినేటెడ్ పదవుల నియామకం చేపట్టలేదు. కేవలం కొన్ని వ్యవసాయ మార్కెట్లకు చైర్మన్లను నియమించారు. దీంతో ఏళ్ల తరబడి పార్టీలో పనిచేస్తున్నా నేటికీ పదవులు దక్కడం లేదనే నైరాశ్యం నెలకొంది.** ఎలాగైనా పదవులు దక్కించుకోవాలని ఆశావహులు అధిష్టానం, నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. మంత్రివర్గ విస్తరణ తర్వాత నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. మరో వైపు పార్టీలో పదేళ్లకు పైబడిన సీనియర్లకు పెద్దపీట వేయాలనే ఆలోచనలో పీసీసీ నేతలు ఉన్నట్లు సమాచారం. త్వరలోనే స్థానిక సంస్థల పోరుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్న నేపథ్యంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్ పదవులపైనా చాలా మంది కన్నేశారు. ఈ నేపథ్యంలో టికెట్లు ఆశిస్తున్న వారికి కాకుండా మిగిలిన వారికి పదవులు కట్టబెట్టే ఛాన్స్ ఉందన్న చర్చ జరుగుతోంది. మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఆలయాల కమిటీలతో పాటు నియోజకర్గ, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులపైనే ఆశలు పెట్టుకున్న నేతల నిరీక్షణకు ఎప్పుడు తెరపడేనో వేచి చూడాల్సిందే మరి.



**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

నామినేటెడ్ పదవుల కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతలు కళ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో నామినేటెడ్ పదవుల నియామకం చేపట్టలేదు. కేవలం కొన్ని వ్యవసాయ మార్కెట్లకు చైర్మన్లను నియమించారు. దీంతో ఏళ్ల తరబడి పార్టీలో పనిచేస్తున్నా నేటికీ పదవులు దక్కడం లేదనే నైరాశ్యం నెలకొంది. ఎలాగైనా పదవులు దక్కించుకోవాలని ఆశావహులు అధిష్టానం, నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. మంత్రివర్గ విస్తరణ తర్వాత నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. మరో వైపు పార్టీలో పదేళ్లకు పైబడిన సీనియర్లకు పెద్దపీట వేయాలనే ఆలోచనలో పీసీసీ నేతలు ఉన్నట్లు సమాచారం. త్వరలోనే స్థానిక సంస్థల పోరుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్న నేపథ్యంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్ పదవులపైనా చాలా మంది కన్నేశారు. ఈ నేపథ్యంలో టికెట్లు ఆశిస్తున్న వారికి కాకుండా మిగిలిన వారికి పదవులు కట్టబెట్టే ఛాన్స్ ఉందన్న చర్చ జరుగుతోంది. మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఆలయాల కమిటీలతో పాటు నియోజకర్గ, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులపైనే ఆశలు పెట్టుకున్న నేతల నిరీక్షణకు ఎప్పుడు తెరపడేనో వేచి చూడాల్సిందే మరి. నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ నేతల నిరీక్షణ కొనసాగుతోంది. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దగ్గర పడుతున్నా నామినేటెడ్ పదవుల నియామకంలో ఇంకా కొన్ని అవకాశాలను భర్తీ చేయడంలేదు. ముఖ్యంగా జిల్లా, నియోజకవర్గస్థాయి, వ్యవసాయ, ఆలయాల చైర్మన్ల పదవులపై కన్నేసిన కొంతమంది సీనియర్ నాయకులతో పాటు ఆశావహులు నిర్విరామంగా తమ ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే పార్టీలో సీనియర్లకు పెద్దపీట వేయాలనే ఆలోచనతో పీసీసీ నేతలు ఉండటం, మంత్రివర్గం విస్తరణ తర్వాత నామినేటెడ్ పదవులపై నిర్ణయాలు తీసుకుంటామని ఎమ్మెల్యేలకు తెలియజేస్తున్నారు. దీంతో నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. కష్టకాలంలోనూ పార్టీని నమ్ముకొని పని చేశాం.. అయినా సరైన గుర్తింపు దక్కడం లేదన్న నైరాశ్యం కొంతమంది నేతల్లో కనిపిస్తుండటం గమనార్హం.

**స్థానిక ఎన్నికల తర్వాతేనా..?!**

త్వరలోనే స్థానిక సంస్థల పోరుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్న నేపథ్యంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల్లోనూ కీలకమైన ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్ పదవులపైనా చాలా మంది కన్నేశారు. ఇప్పటి నుంచే జోరుగా నమ్మకంతో నేతల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న వారికి కాకుండా నామినేటెడ్ పదవుల్లో అవకాశం మిగిలిన వారికి ఇచ్చే చాన్స్ ఉందన్న చర్చ జరుగుతోంది. దీనికి తోడు పార్టీలో పదేళ్లకు పైబడి పనిచేసే వాళ్లకు ముందు ప్రియారిటీ ఇవ్వాలని ఇటీవల రాజధానిలో నిర్వహించిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి నటరాజ్ మీనన్ తెలిపిన నేపథ్యంలో డీసీసీల వద్ద నుంచి నాయకుల జాబితాలు కూడా వెళ్లడం గమనార్హం. ఈ పరిణామాలన్నీ నామినేటెడ్ పదవులను సీనియర్లకే అన్నట్లుగా సుస్పష్టం చేస్తున్నాయి. అంతే కాకుండా సమర్థవంతమైన నాయకత్వాన్ని క్షేత్రస్థాయిలో ప్రదర్శించిన నేతలకే అవకాశాలు కనిపిస్తుండటం గమనార్హం.

**నియోజకవర్గ, జిల్లా పదవులపై ఆశలు..**

వాస్తవానికి నామినేటెడ్ పదవుల్లో మార్కెట్ కమటీ చైర్మన్లు, డైరెక్టర్లు, ఆలయాల కమిటీలతో పాటు మరికొన్ని నియోజకర్గ, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులున్నాయి. ఇందులో మార్కెట్ కమిటీ, ఆలయాల కమిటీ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులకు ఎక్కువగా డిమాండ్ ఉంది. ఈ పదవులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశావహులకు లింక్ చేసే పరిస్థితి కనిపిస్తోంది. ఈనేపథ్యంలోనే అనేక ఆలయాలు, కొన్ని మార్కెట్ పాలకవర్గాల కమిటీలు ఉమ్మడి ఆదిలాబాద్‌లో పెండింగ్‌లో ఉండటం.. ఆ వాదనకు బలం చేకూర్చినట్లవుతోంది. అందుకే దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు పాలకవర్గాల్లో నియామకాల ప్రక్రియలో ఎలాంటి చలనం లేకుండా పోయింది. దీనంతటికీ మంత్రివర్గ కూర్పు లేకపోవడమే కారణమని తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ తర్వాతే నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందనేది కీలక నేతలు చెబుతుండడంతో ద్వితీయ శ్రేణి నాయకులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టడంతో పాటు పార్టీ అధిష్టానం చుట్టూ ప్రదక్షిణక్షలు చేస్తున్నారు.

# బండ బాదుడు

- మళ్లీ పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర
- సిలిండర్‌పై పెంపు రూ.50
- నేటి నుంచి అమల్లోకి
- చుక్కలనంటుతున్న కూరగాయల ధరలు
- పెరిగిన ధరలతో బెంబేలెత్తుతున్న సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు..

**ఆదిలాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

సామాన్యుడికి గ్యాస్ సిలిండర్ మళ్లీ బరువెక్కింది. సోమవారం వంట గ్యాస్ సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం అదనంగా రూ.50 బాదింది. దేశ వ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ ధరలను కేంద్ర ప్రభుత్వం సోమవారం పెంచింది. గృహా వసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 చొప్పున పెంచుతున్నట్లు కేంద్ర పెట్రోలియం, సహాయ వాయువుల శాఖమంత్రి హర్దీప్ సింగ్ పురీ వెల్లడించారు. ఈ ధరల పెంపు ఉజ్వల పథకం లబ్ధిదారులకు సైతం వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. తాజా పెంపుతో సాధారణ వినియోగదారులు, ఉజ్వల పథకం లబ్దిదారులు ఇప్పుడు ఒక్కో సిలిండర్‌పై చెల్లిస్తున్న దానిపై అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. గతవారంలో హెూటళ్లు, రెస్టారంట్లు సహా వాణిజ్య అవసరాల కోసం వినియోగించే వాణిజ్య సిలిండర్ గ్యాస్ ధరను కేంద్ర ప్రభుత్వం రూ.41 మేర తగ్గించిన విషయం తెలిసిందే. రా ష్ట్రాలను బట్టి ఈ తగ్గింపులో మార్పు ఉంటుంది. మరోపక్క సోమవారం మధ్యాహ్నం పెట్రోల్, డీజీల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం పెంచింది. పెంపుతో వినియోగదారులపై ప్రభావం పడబోదని స్పష్టం చేసింది. భారాన్ని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలే భరిస్తాయని పేర్కొంది. పెరిగిన ధరలు ఏప్రిల్ 8 నుంచి అమలులోకి వస్తాయని కేంద్రం పేర్కొంది.




## 'విద్యాభివృద్ధిపై దృష్టి సారించాలి'

**నార్నూర్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

నార్నూర్ మండల కేంద్రంలో సోమవారం ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లాధ్యక్షుడు పెందోర్ సంతోష్‌ను సోమవారం బంజారా హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల విద్యాభివృద్ధికి కృషి చేసేందుకు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సంతోష్, కార్తీక్, రోహిదాస్ పాల్గొన్నారు.



## నార్నూర్ తైబజార్ వేలం



**నార్నూర్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీలోని గల తైబజార్ వేలం రూ. 3 లక్షలకు పలికింది. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ జవహర్ లాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వేలం పాటలో నలుగురు వేలం పాడారు. జాదవ్‌ధన్‌లాల్ రూ.3 లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నారు. కార్యక్రమంలో సికిందర్, దుర్గే కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం ప్రత్యేక దృష్టి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**మంచిర్యాల, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నస్పూర్ మండలం సీతారాంపల్లి గ్రామానికి చెందిన జాడి శ్రీనివాస్ తన తండ్రి పేరిట నస్పూర్ శివారులో భూమి ఉందని, ఆయన మరణించినందున అట్టి భూమిని తన తల్లి పేరిట విరాసత్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం కామన్పల్లి గ్రామానికి చెందిన నీల సత్తవ్వ తాను ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నానని, చిరునామాలో గ్రామం పేరు పొరపాటున కవ్వాల్గా నమోదు అయిందని, ఈ తప్పును సవరించి తనకు రుణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన మేకల గట్టయ్య తాను గత 50 సంవత్సరాలుగా తన సొంత భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నానని, ఇట్టి భూమికి తనకు పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భీమిని మండలం అక్కలపల్లి గ్రామానికి చెందిన చాపిడి అర్జయ్య తనకు గల భూమిని తన నలుగురు కుమార్తెలకు రిజిస్ట్రేషన్ దస్తావేజుల ద్వారా దానంగా ఇచ్చానని, వారి వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి వారికి పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బహుజన్ ముక్తి పార్టీ ప్రతినిధి మొయ్యి వేణుగోపాల్ తన దరఖాస్తులో జిల్లాలోని మందమర్రి శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయపై విచారించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. మంచిర్యాల పట్టణం రాంనగర్ ప్రాంతానికి చెందిన ఇప్పల లచ్చయ్య తన భార్యకు వైద్య సేవల నిమిత్తం చెల్లించిన నగదును ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు చెందిన పుల్లూరి సుధాకర్ తమ వార్డులో చేపట్టిన వరద నీటి కాలువ, మురుగ కాలువల నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన మురిమడుగుల ఇమ్మాన్యుయేల్ తనకు గల భూమి నిషేధిత జాబితాలో నమోదు అయిందని, తొలగించి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం హన్మంత్పల్లి గ్రామానికి చెందిన గుమ్ముల రాజేశ్వరి తన భర్త గల్ఫ్ దేశానికి ఉపాధి కోసం వెళ్ళి అకస్మాత్తుగా మృతి చెందాడని, జి.ఓ. ప్రకారం పరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ ఎరుకల ప్రజా సమితి ప్రతినిధులు తమ దరఖాస్తులో ఎరుకుల కులస్తులకు ఎస్.సి., ఎస్.టి. మానిటరింగ్ కమిటీలో చోటు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సంబంధిత ఆయా శాఖల అధికారులు అర్జీలను త్వరతగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.



## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

ఆడబిడ్డ పెళ్లికి ప్రభుత్వం అందజేస్తున్న పెళ్లి కానుకను లబ్ధిదారులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. సోమవారం కౌటాల, సిర్పూర్ మండల కేంద్రాలలో కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పథకాల అమలులో పొరపాట్లు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు పుష్పలత శ్రీనివాస్ నాయకులు విజయ్, శ్యామల, గురుదాస్, కవిరాజ్, మధు, అశోక్, నాగేందర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు దరఖాస్తు చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

**నిర్మల్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, టీపీసీసీ అగ్రశ్రేణి నేతలకు తప్పుడు దరఖాస్తు ఇచ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నిర్మల్లో సోమవారం ఫిర్యాదు చేశారు. నిర్మల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా పేర్కొంటూ పైవారికి ఎలాంటి ఆధారాలు లేకుండా ఫిర్యాదు చేసిన అజర్పై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఇందులో సాయి ప్రతాప్, సయ్యద్ అర్షద్ ఓద్దీన్, నవీద్ ఉన్నారు.



## ఆశ్రమ పాఠశాలలో తాగునీటి కొరత



**జైనూర్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పాట్నాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో తాగడానికి గుక్కెడు నీరు లేక విద్యార్థినిలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో విద్యుత్ సరఫరా నిలచిపోవడంతో పాటు బోర్‌వెల్ చెడిపోవడంతో తాగు నీరు లేక విద్యార్థులు అల్లాడిపోతున్నారు. ఇక చేసేదేమీ లేక స్థానిక గ్రామంలోకి వెళ్లి బోరింగ్ నీళ్లు తెచ్చుకొని వాటర్ బాటిల్‌లో నింపుకుంటున్నారు. అసలే ఎండాకాలం భానుడు భగ భగ నిప్పులు చెరుగుతున్న వేళ చిన్నారులకు తాగు నీటి సరఫరా ఆగిపోవడం బాధాకరమని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు గతిన స్పందించి తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.

# యాసంగి కొనుగోళ్లకు రెడీ

**దొడ్డు, సన్న రకాలకు వేరు వేరుగా కేంద్రాలు - సమస్యగా మారనున్న గన్నీ బ్యాగుల సేకరణ**



**ముథోల్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించేందుకు యంత్రాంగం సిద్ధమవుతున్నది. సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వేరువేరుగా సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇటీవలే కలెక్టర్ అభిలాష అభినవ్ కూడా కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.కేంద్రాల నిర్వాహకులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చి సెంటర్లను ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో మంగళవారం నుంచి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తం గా ఇప్పటి వరకు కోతలు ప్రారంభం కాలేదు. మరో రెండు వారాల్లో లోకేశ్వరం, కుంటాల, సారంగాపూర్, లక్ష్మణచాంద మండలాల్లో కోతలు ఊపందుకుని ధాన్యం కేంద్రాలకు చేరే అవకాశం ఉన్నది. గన్నీ బ్యాగుల కొరత ప్రధాన సమస్యగా మారిం ది. 40 లక్షల వరకు గన్నీ బ్యాగులు అవసరమవుతాయి. ప్రస్తుతం జిల్లాలో కేవలం 12. 60 లక్షలు మాత్ర మే అందుబాటులో ఉన్నాయి. వచ్చే పది రోజుల్లో దాదాపు 28 లక్షల గన్నీ బ్యాగులను సేకరించడం అధికారులకు సవాల్‌గా మారనున్నది. గన్నీ బ్యాగుల సేకరణ ఆలస్యమైతే కొనుగోళ్ల ప్రక్రియకు ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు కస్టమ్ మి ల్లింగ్ కోసం తరలించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చి విక్రయించిన రైతులకు సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడనున్నా రు. కాగా.. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పిస్తామని, కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.



## గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవు

**ఉట్నూర్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

గంజాయి సాగు చేసినా, సరఫరా చేసి నా కఠిన చర్యలు తీసుకుంటామని ఇంచార్జీ ఎస్సై సునీల్ తెలిపారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ సమీపంలో ఉట్నూర్ నుండి మం చిర్యాల వైపునకు వెళ్లే రోడ్డు పక్కన వాహనాలను తనిఖీ చేస్తున్నారు. గంజాయితో కరీంనగర్‌కు వెళుతున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటుగా ముగ్గురు వ్యక్తులు, ఆటోను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సరఫరాపై వివరాలు ఆరా తీస్తున్నారు.

## సమగ్ర సర్వే నిధులు విడుదల చేయాలి

**ఉట్నూర్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఎన్యూ మరేటర్, సూపర్ వైజర్, కంప్యూటర్ ఆపరేటర్లలకు తక్షణ మే నిధులు విడుదల చేసి వారి అకౌంట్లో జమ చేయాలని టీజీటీటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ జాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా ప్రణాళిక అధికారి వెంకట రమణను ఆయన కలసి విన్నవించి విన తిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సర్వే చేసి నెలల గడుస్తున్న ప్రభుత్వం నేటికీ నిధులు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. సర్వేలో భాగమైన అందరికీ నిధులు కేటాయిస్తున్నామని ప్రభుత్వం చెప్పినప్పటికీ నిధుల విడుదలలో జాప్యమెం దుకు చేస్తుందో తెలియడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే నిధుల విడుదలకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## కొనుగోలును ప్రారంభించండి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సోమవారం అఖిలపక్ష రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లావ్యాప్తంగా రైతులు 79 వేల ఎకరాల్లో జొన్న పండించారని పేర్కొన్నారు.

## ఒకేచోట విడివిడిగా ఫొటోలు..



విజయ్ దేవరకొండ రష్మిక రిలేషన్ షిప్ లో ఉన్నారంటూ గత కొద్దీ రోజులుగా వార్తలు వస్తూనే ఉన్నాయి. వీరిద్దరూ అధికారికంగా అనౌన్స్ చేయనప్పటికీ.. తరచూ వీరు షేర్ చేసే ఫొటోల ద్వారా హింట్స్ ఇస్తూనే ఉన్నారు. రష్మిక విజయ్ ఇంట్లో పండగలు సెలెబ్రేట్ చేసుకోవడం, ఇద్దరు కలిసి లంచ్ డేట్ కి వెళ్లిన ఫొటోలు ఆమధ్య తెగ వైరల్ అయ్యాయి. అయితే తాజాగా మరోసారి వీరిద్దరూ కలిసి వెకేషన్ వెళ్లినట్లు తెలుస్తోంది.ఇటీవలే రష్మిక తన పుట్టినరోజు సందర్భంగా ఒమన్ బీచ్ లో ఎంజాయ్ చేస్తూ ఉన్న ఫొటోలను షేర్ చేసింది. కాగా, ఆ తర్వాత రోజు విజయ్ కూడా బీచ్ లో ఉన్న ఫోటోలను షేర్ చేశాడు. అయితే వీరిద్దరూ విడివిడిగా ఫొటోలు షేర్ చేసినప్పటికీ.. వాటిలో ఉన్నబ్యాక్ గ్రౌండ్ ఒకేలా ఉండడం గమనార్హం. ఇద్దరూ బీచ్ లో ఉన్నారు. అలాగే ఇద్దరి ఫొటోల్లో తెల్లటి ఇసుక, నీలం గొడుగులు, తాటి చెట్లు కామన్ గా ఉన్నాయి. దీంతో వీరు ఒకే చోట వెకేషన్ ఎంజాయ్ చేసినట్లు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ప్రతిసారి ఇలా ఫొటోలతో హింట్ ఇస్తున్నారు అంటూ కామెంట్లు పెడుతున్నారు.

# బాలీవుడ్‌లోకి అనన్య ఎంట్రీ

వకీల్‌సాబ్‌తో ఫేమ్ సంపాదించుకున్న తెలుగమ్మాయి అనన్య నాగళ్ల బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఏకంగా లేడీ ఓరియెంటెడ్ సినిమాతోనే ఎంట్రీ ఇస్తోంది. అయితే ఈ చిత్రానికి రాకేష్ జగ్గి దర్శకత్వం వహిస్తుండగా, ఇమ్మత్ లదుమోర్ నిర్మిస్తున్నారు. తెలుగు అమ్మాయి అనన్య నాగళ్ల ఇండస్ట్రీలో రాణిస్తోంది. వరుస సినిమాలో అదరగొడుతుంది. మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ఎంపిక చేసుకుంటూ.. నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. అయితే ఈ వకీల్‌సాబ్ హీరోయిన్ ఇప్పుడు బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోందని టాక్. ఏకంగా లేడీ ఓరియెంటెడ్ చిత్రంతో ఆమె బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వడం విశేషం. ఈ చిత్రానికి రాకేష్ జగ్గి దర్శకత్వం వహిస్తుండగా, ఇమ్మత్ లదుమోర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో అనన్య ఓ ట్రైబల్ అమ్మాయిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. అనన్య నాగళ్ల సాఫ్టవేర్ జాబ్ వదులుకుని షాదీ అనే షార్ట్ ఫిల్మ్‌తో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మల్లేశం సినిమాతో వెండితెరపై కనిపించింది. ఇలా ఆమెకు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన వకీల్ సాబ్‌లో ఛాన్స్ వచ్చింది. ఈ సినిమాలో అనన్య నటనకు మంచి మార్కులు పడ్డాయి. అప్పటి నుంచి కంటెంట్ ఉన్నసినిమాలు ఎంచుకుంటూ టాలీవుడ్‌లో రాణిస్తోంది. ఇదిలా ఉండగా అనన్య నాగళ్ల సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటుంది. ఎప్పటికప్పుడూ ఫొటోలు షేర్ చేస్తుంటుంది. ఇటీవల రామనవమి సందర్భంగా కూడా ఫొటోలు షేర్ చేసింది. ఈ ఫొటోలు కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





## రిలీజ్ కి ముందే చరణ్ రికార్డులు షురూ..

రామ్ చరణ్ - బుచ్చిబాబు సనా కాంబోలో రాబోతున్నమోస్ట్ అవైటెడ్ 'పెద్ది' రిలీజ్ కి ముందే రికార్డుల వేట షురూ చేసింది. శ్రీరామనవమి సందర్భంగా చరణ్ పాత్రను ఇంట్రడ్యూస్ చేస్తూ ఫస్ట్ షాట్ రిలీజ్ చేయగా యూట్యూబ్ లో మిలియన్ల వ్యూస్ తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. విడుదలైన 24 గంటల్లోనే 36. 5 మిలియన్ల వ్యూస్ తో కొత్త రికార్డు నమోదు చేసింది. ఇప్పటివరకు యష్ 'టాక్సిక్' గ్లిమ్ప్స్ పేరుపై ఉన్న రికార్డును బ్రేక్ చేసింది. దీంతో మెగా ఫ్యాన్స్ ఈ సినిమాతో చరణ్ మరోసారి బాక్స్ ఆఫీస్ రికార్డులు కొల్లగొట్టడం ఖాయమని ఫిక్స్ అయిపోతున్నారు. 'పెద్ది' నుంచి చరణ్ ఫస్ట్ షాట్ ఎంతో పవర్ ఫుల్ గా కనిపించింది. ఇందులో చరణ్ గల్లీ క్రికెటర్ గా కనిపించబోతున్నారు. చేతిలో క్రికెట్ బ్యాట్, నోట్లో సిగార్, పవర్ ఫుల్ లుక్స్ తో ఫ్యాన్స్ గూస్ బంప్స్ తెప్పించింది చరణ్ ఇంట్రో షాట్. వృద్ధి సినిమాస్, మైత్రి మేకర్స్ భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కథానాయికగా నటిస్తోంది.

## 'బేబి' నోట బూతు మాట..



సిద్ధూ జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్య కలిసి జంటగా నటిస్తున్నకొత్త చిత్రం 'జాక్'. ఈ చిత్రం ఏప్రిల్ 10న గ్రాండ్ లెవెల్లో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మూవీ యూనిట్ ప్రమోషన్స్ వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే హీరో, హీరోయిన్ కలిసి పలు ఫేమస్ జిల్లాల్లో సందడి చేస్తున్నారు. రీసెంట్‌గా భీమవరంలో హోరెత్తించారు. ప్రమోషన్లలో భాగంగానే విష్ణు కాలేజీలో ఒక ఈవెంట్ ఏర్పాటు చేశారు. అందులో హీరో సిద్ధూ, హీరోయిన్ వైష్ణవి చైతన్యతో పాటు మూవీ యూనిట్ పాల్గొంది. ఈ సందర్భంగా ఆ కాలేజీ స్టూడెంట్స్‌తో ఇంటరాక్ట్ అయ్యారు. ఇందులో 'బేబీ' బ్యూటీ వైష్ణవి చైతన్య ఎన్నో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. స్టేజ్‌పై వైష్ణవి మాట్లాడుతూ.. స్టూడెంట్ లైఫ్ గురించి ఎన్నో విషయాలు తెలిపారు. అలాగే తనపై స్టూడెంట్స్ చూపిస్తున్న ప్రేమ, అభిమానాలకు ధన్యవాదాలు తెలిపింది. వారి ప్రేమ, ఎనర్జీ గురించి పొగిడేసింది. అదే ఊపులో ఈ ఈవెంట్ ఏర్పాటు చేసింది భీమవరంలో అనేది మర్చిపోయి.. రాజమండ్రి అని అనేసింది. దీంతో స్టూడెంట్స్ అందరూ ఒక్కసారిగా అరవడం మొదలెట్టారు. అదే సమయంలో స్టేజ్‌పైనే ఉన్న హీరో సిద్ధూ.. వైష్ణవి వద్దకు వచ్చి ఇది భీమవరం అని చెప్పి వెళ్లాడు. అలా సిద్ధూ చెప్పిన తర్వాత వైష్ణవి ఒక్కసారి హో F**k అని అనేసింది. అది కూడా మైక్ ఆఫ్ చేయకుండా అనేయడంతో అందరికీ వినిపించేసింది. చివరకు ఎలాగోలా కవర్ చేసింది. ప్రస్తుతం అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



# గులాబీ పండుగను విజయవంతం చేద్దాం

## వేలాదిగా తరలి వెళదాం.. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

**మంచిర్యాల, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

వరంగల్ జిల్లాలో ఈనెల 27న నిర్వహించే రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ అన్నారు. సోమవారం మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావుతో కలిసి మంచిర్యాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో, బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి బెల్లంపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులతో, మందమర్రి మండలం క్యాథనపల్లి మున్సిపాలిటీలోని తన నివాసంలో చెన్నూర్ నియోజకవర్గం ముఖ్య నాయకులతో కలిసి వేరువేరుగా బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయోత్సవ సన్నాహక సమావేశాలలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు నియోజకవర్గానికి మూడు వేల మంది చొప్పున ముఖ్యమైన నాయకులు హాజరుకావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఇప్పటి వరకు సాధించింది ఏమీలేదని, ప్రజలు ఇప్పుడే రేవంత్ పాలనను, నియోజకవర్గాలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వ్యతిరేకిస్తున్నారన్నారు. బీజేపీ ఎంపీలు కూడా రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలని, అదే విధంగా ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశాలలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, డాక్టర్ రాజారమేష్, మాజీ ప్రజాప్రతినిధులు తిప్పని లింగయ్య, నల్మాసు కాంతయ్య, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పిటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అలరించిన కళాకారులు

**మందమర్రి, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని యాపల్ ప్రాంతంలోని కోదండ రామాలయం ఆవరణలో నిర్వహించిన శ్రీసీతారాముల కళోత్సవం-2025 కార్యక్రమం ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. ముందుగా నటరాజ స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిఖర ఆర్ట్స్ అధినేత, తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు సారధ్యంలో జరిగిన కళోత్సవానికి ఉప్పులేటి నరేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నేత సోత్కు సుదర్శన్ హాజరై, మాట్లాడుతూ... శ్రీరామ నవమిని పురస్కరించుకొని ప్రతి ఏటా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. పట్టణంలో అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణిస్తున్న, మట్టిలో మాణిక్యాలు లాంటి కళాకారులు ఉన్నారన్నారు. కళాకారులకు ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను శ్రీ రాముడి భక్తి గీతంతో ప్రముఖ గాయకుడు బాలు ప్రారంభించగా, కోల్ ఇండియా కళాకారుడు సాధనవేణి ప్రభాకర్ ఆర్కెస్ట్రా బృందం పాటలు, శ్రీ సాయి నాట్య కళానిలయం అశ్విని బృందం, ఆసం కళ్యాణ్ బృందం, ఏబిసిడి డాన్స్ అకాడమీ, యూట్యూబర్ సమీరా బృందం కళాకారులు పూసాల బృంద, బుక్యా హరిత, ప్రదర్శించిన జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అమితంగా అలరించాయి.

# జై బాపు జై భీమ్ జై సంవిధాన్‌ను విజయవంతం చేయాలి

**మందమర్రి, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ నీలయ్య కోరారు. ఏఐసీసీ పీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని శంకరపల్లి గ్రామ శివారులో మండలంలోని అన్ని గ్రామాల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత అని రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ నిర్వహిస్తుందన్నారు. దీనిని మండలంలో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రాంచందర్, సీనియర్ నాయకులు కడారి జీవన్ కుమార్ పాల్గొన్నారు.





## ముధోల్‌లో ముమ్మరంగా

# పారిశుధ్య పనులు

**ముథోల్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

ముథోల్‌లోని వివిధ వార్డుల్లో పారిశుధ్య పనులను సోమవారం ముమ్మరంగా చేపట్టారు. మురికి కాలువలను శుభ్రం చేసి ఎప్పటికప్పుడు తీసిన మట్టిని తొలగించే పనులు చేపడుతున్నారు. అదేవిధంగా చెత్తాచెదారాన్ని ఇంటింటా తిరుగుతూ సేకరించి వాహనంలో తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఈవో అన్వర్ అలీ మాట్లాడుతూ ప్రజలు తమ వంతు బాధ్యతగా గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. చెత్తను మురుగు కాలువల్లో వేయకుండా చెత్త బండలోనే వేయాలన్నారు.

# కొర్రమీను సాగు కోసం దరఖాస్తుల స్వీకరణ



జిల్లా మత్స్యశాఖ అధికారి వై.సాంబశివరావు

**మంచిర్యాల, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

మత్స్య పరిశ్రమలో పని చేస్తున్న ఔత్సాహికులు, మత్స్యకారులు, మత్స్య రైతులు, హోల్‌సెల్, రిటైల్ చేపల విక్రయదారులు చేప పిల్లలు ఉత్పత్తిదారులు, ఆసక్తి గల వారి నుండి కొర్రమీను సాగును చేసేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి వై.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాను ముర్రెల్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు గుర్తించడం జరిగిందని, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా సాధారణ (జనరల్) క్యాటగిరీ-40 శాతం, ఎస్.సి./ఎస్.టి./ మహిళ క్యాటగిరీ-60 శాతం రాయితీపై 3 హచరి యూనిట్లు, 10 హెక్టార్ల చేపల పెంపకం చెరువులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులు మత్స్యశాఖ కార్యాలయంలో స్వీకరించడం జరుగుతుందని, వివరాలకు జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్-8లో గల జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి వై.సాంబశివరావు ఈ సందర్భంగా సూచించారు.

# బెదిరించిన వ్యక్తిపై కేసు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

శ్రీరామ నవమి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో భాగంగా ఆదిలాబాద్ ర్యాలీలో కత్తిని చూపిస్తూ చంపేస్తానంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన పట్టణంలోని చించేరివాడకు చెందిన తోట విగ్నేష్ పై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సిఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. కత్తులను చూపిస్తూ బెదిరించి చంపేస్తామంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా ఎలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నిన్న శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ ర్యాలీలో నిందితుడు కత్తితో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడని, అతనిపై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రజలు ముఖ్యంగా యువకులు సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు.

# అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి



## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి అర్జీలను ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కలెక్టర్ రాజర్షి షా స్వీకరించారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజాఫిర్యాదులలో భాగంగా వివిధ మండలాల నుండి వచ్చిన దరఖాస్తుదారుల నుండి దరఖాస్తులను అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా 111 దరఖాస్తులను స్వీకరించారు. గతంలో ఎలుగుబంటి దాడిలో గాయపడిన తలమడుగు మండలం లోని వ్యక్తికి 5 లక్షల రూపాయల చెక్కును కలెక్టర్ అందజేశారు. వివిధ శాఖలకు సంబంధించి విద్యా, వైద్యం, మున్సిపల్, ఎస్సీ కార్పొరేషన్, విద్యుత్తు, పంచాయతీ రెవెన్యు, మహిళా శిశు సంక్షేమ శాఖ, తదితర శాఖల నుండి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణిపై ఎండల ప్రభావం...**

ఆదిలాబాద్ జిల్లాలో రోజురోజుకు ఎండలు ముదరడంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. దీంతో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిపై ఎండలు పెను ప్రభావం చూపుతోంది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షా పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఉదయం 9 గంటలు దాటితేనే ఎండల ప్రభావం పెరగడంతో ప్రజలు వచ్చి అర్జీలను పలు సమస్యలపై అర్జీలను అందజేశారు.

# ఎమ్మెల్యేను కలిసిన జనార్దన్ రాథోడ్

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సోమవారం ఆదిలాబాద్ మాజీ జడ్పీ ఛైర్మన్ జనార్దన్ రాథోడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పార్టీ బలోపేతంపై నాయకులు, కార్యకర్తలతో కలిసి చర్చించారు. వరంగల్‌లో జరిగే మహాసభను విజయవంతం చేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ పీఏసీఎస్ ఛైర్మన్ సురేష్, రామేశ్వర్ తదితరులున్నారు.





## వేసవిలో వండర్ డ్రింక్

వేసవి వచ్చేసింది.. ఎండలకు కొద్ది సేపటికే గొంతెండి పోతుంటుంది. శరీరం ఎక్కువగా డీహైడ్రేట్ అయి పోతూ ఉం టుంది. ఇలాంటి సమయం లో శీతల పానీయాలు శరీరానికి చాలా హాయినిస్తా యి. ఇలాంటి సమయంలో రోడ్డు పక్కన దొరికే పానీయాలు తాగడం ఆరోగ్యానికి మంచి ది కాదు. మన ఇంట్లో తయా రు చేసుకుంటే చాలా మంచి ది. మనం ఇంట్లో సింపుల్‌గా తయారు చేసుకునే వండర్ డ్రింక్.. నిమ్మ జ్యూస్. ఒక గ్లాస్ నిమ్మ జ్యూస్ తీసుకుంటే శరీరానికి 76 కిలో కేలరీల శక్తి లభిస్తుంది. దీనిలో భాగంగా 40 గ్రాముల సోడియా, 20.1 గ్రాముల కార్బోహైడ్రేట్స్ శరీరానికి అందుతాయి. గ్లాసులో కొంచెం నిమ్మరసం తీసుకుని దానిలో తాజా పుదీనా ఆకులు వేసి స్వీట్ కోసం షుగర్ పౌడర్ లేదంటే మీకిష్టమైన సిరప్‌ను రెండు టేబుల్ స్పూన్లు కలుపుకోవాలి. ఇప్పుడు గ్లాసు నిండా చల్లని కార్బోనేటెడ్ వాటర్ పోయాలి. క్లబ్ సోడా, టానిక్ వాటర్ వంటివి పోయాలి. జ్యూస్ చల్లగా లేకుంటే కొన్ని ఐస్ క్యూబ్స్ వేసుకుంటే డ్రింక్ చాలా బాగుంటుంది.

-ప్రభాత సమాచారం, న్యూస్ డెస్క్



# నిమ్మ పండు ఆరోగ్యం మెండు






మనం చూసే నిమ్మకాయలు పరిమాణంలో తేడాలు తప్ప అన్నీ ఒకేలా కనిపిస్తాయి. కానీ నిమ్మలో చాలా రకాలున్నాయి. ఫ్రింగ్, కాఫిర్, కీ మస్క, వైల్డ్ స్వీట్ లైమ్ ఇలా పలు రకాలున్నాయి. పెద్ద పరిమాణంలో ఉండే నిమ్మకాయలను గజనిమ్మ అంటారు. ప్రధానమైనది పులుసునిమ్మ. దీన్నే పేపర్/కాగితం నిమ్మ అని కూడా అంటారు. వీటిల్లో రసం ఎక్కువగా ఉంటుంది. నిమ్మ శాస్త్రీయ నామం సిట్రస్ ఔరంటీఫోలియా.

నిమ్మ గురించి మొదటిసారిగా 10వ శతాబ్దంలోని అరబ్ సాహిత్యంలో పేర్కొన్నారు. మన దేశంలోని అస్సాంలో మొదటిసారిగా పండించారు. సుదీర్ఘ సముద్రయానం చేసే వారిలో స్కర్వీ వ్యాధి గ్రస్తులపై నిమ్మరసంతో ప్రయోగాలు చేసి ఇందులోని విటమిన్ సి లోపించడం తో ఈ వ్యాధి పెరుగుతోందని గుర్తించారు.



### పోషక విలువలు ఇలా.. (ప్రతి వంద గ్రా)

- శక్తి - 30 కేసీఏఎల్
- పిండిపదార్థాలు - 9 గ్రా
- చక్కెర - 2.5 గ్రా
- పీచు పదార్థాలు - 2.8 గ్రా
- కొవ్వు పదార్థాలు - 0.3 గ్రా
- మాంసకృత్తులు - 1.1 గ్రా
- నీరు - 89 గ్రా
- విటమిన్ సి - 53 ఎంజీ
- సిట్రిక్ ఆసిడ్ - 5 గ్రా

### ఉపయోగాలు ఎన్నో..

- వేసవిలో నిమ్మరసం నీటిలో కలుపుకుని ఉప్పు లేదాపంచదాతో కలిపి పానీయంగా తాగడం చాలా మందికి ఇష్టం. ఒక నిమ్మ పండు నుంచి ఇంచుమించు 2-3 చెంచాల రసం వస్తుంది.
- నిమ్మరసంలో చేపలు, మాంసం కొంతసేపు నానబెటిన తరువాత వండుకుంటే కూర మంచి రుచిగా ఉంటుంది.
- నిమ్మపండులతో ఊరగాయ చేస్తారు.. పత్యానికి చాలా మంచిది.
- ఎండాకాలంలో నిమ్మరసం కలిపిన సోడ ఉపయోగం తెలియని వారుండరు.
- నిమ్మతో షర్బత్‌లు, నిల్వ ఉండే పానీయాలు తయారు చేస్తారు. ఎండన పడి వచ్చిన వారికి అలసట తగ్గేందుకు, మరింత శక్తి కోసం నిమ్మరసం మంచిది. అందుకే నిరాహారదీక్షల విరమణ సమయంలో నిమ్మరసం ఇస్తారు.
- నిమ్మరసంలోని విటమిన్ సి గల యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు కలిగి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. జలుబుతో బాధపడేవారికి ఇది చాలా మంచిది. ఆయుర్వేదంలో నిమ్మ జీర్ణక్రియలోనూ చర్మ సౌందర్యానికి చాలా మంచిదని తేలింది. వేడినీటిలో నిమ్మరసం కలిపి తాగితే కాలేయ శుద్ధి జరుగు తుంది.
- నిమ్మలోని కొన్ని పదార్థాలు కాన్సర్ రాకుండా నిరోధిస్తా యట.
- రెండుచెంచాల నిమ్మకాయ రసాన్ని ఒక గ్లాసులో కలుపుకుని రోజుకి నాలుగు లేక ఐదు సార్లు తాగితే పచ్చకామెర్ల వ్యాధి తగ్గుతుంది.
- రోజూ పరగడుపున ఒక గ్లాసుడు గోరువెచ్చనినీటిలో ఒక నిమ్మకాయ రసం కలుపుకుని కొంచెం ఉప్పు (అవసర మనుకుంటే) కలిపి తాగితే ఊబకాయం తగ్గుతుంది.
- విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది.
- నిమ్మ లోని ఆమ్లాలు.. జీర్ణక్రియను పెంచుతాయి.
- రోజూ ఉదయం నిమ్మరసం తాగితే ఒంట్లో నీటి శాతం తగ్గకుండా చూసుకోవచ్చు. ఇది ఫ్రూట్ జాతికి చెందినదే..
- గొంతు ఇన్‌ఫెక్షన్లకు నిమ్మ రసం మంచి ఔషధం
- జర్వంగా ఉన్న సమయంలోనూ పండ్ల రసాలతో పాటు నిమ్మ రసం కూడా ఇస్తే ఫలితం ఉంటుంది.



నిమ్మ చెట్టు.. ఒక పొదలాగా కనిపిస్తుంది. కొమ్మలు తేలిగ్గా దట్టంగా ఉండి ముళ్లు కూడా ఉంటాయి. లేత ఆకులు ఆకుపచ్చరంగులో అండా కారంగా ఉంటాయి. అంచులు వంకర టింకరగా ఉంటాయి. వీటికి చిన్న చిన్న పూలు గుత్తులుగా ఏర్పడతాయి. ఇవి ద్విలింగ పూలు, పూత మొగ్గలు మొదట ఉదా లేక గులాబీ రంగులో ఉండి క్రమేపీ తెలుపు రంగుకి మారతాయి. వీటి రక్షక పత్రాలు ఆలుకు కొనదేలి ఆకుపచ్చగా తెల్లగా, మందంగా ఉంటాయి. కేసరాలు చిన్నవిగా ఉంటాయి. అండాశం ఆకుపచ్చగా ఉబ్బి ఉంటుంది.

- చుండ్రు, మొటిమలు, మొదలగు చర్మవ్యాధులకు నిమ్మరసాన్ని రెండు మూడు సార్లు రోజూ తాగితే ఉపయోగం ఉంటుంది.
- మలబద్ధకం, అజీర్తి, అగ్ని మాంధ్యం మొదలగు జీర్ణక్రియ వ్యాధుల్లో ప్రతిరోజూ రెండు పూటలా నిమ్మరసం తాగితే జీర్ణరసాలు బాగా ఊరతాయి.
- చర్మ సౌందర్యానికి నిమ్మకు మించింది లేదు. అందుకే చాలా సౌందర్య సబ్బుల్లో నిమ్మను వాడతారు. ముఖంపై ముడతలను, మృతకణాలను ఇది తొలగిస్తుంది. జిడ్డు చర్మాన్ని మాపడానికి దీనికి మించిన మందు లేదు. చేతులు, పాదాలు మృదువుగా ఉండటానికి నిమ్మరసం వాడతారు. శిరోజ సంరక్షణకు కూడా నిమ్మ మేలు చేస్తుంది.

# పదేళ్ల పోరాటంతోనే జిల్లాకు ఎయిర్‌పోర్ట్



- ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. ఎన్నికల్లో గెలిచిన ఓడిన పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అందరూ కృషి చేయాలి..
- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్
- బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే జిల్లాకు రావాల్సిన కేంద్ర ప్రాజెక్టులు రాలేదు..
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్
- త్వరలోనే జిల్లాలో ఎయిర్ పోర్ట్ భూసేకరణ, మౌలిక వసతుల ఏర్పాటు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

గత పదేళ్లుగా చేసిన పోరాటం వల్లే అదిలాబాద్‌లో ఎయిర్ ఫోర్స్‌తోపాటు ఎయిర్ పోర్ట్ ఏర్పాటు సాధ్య పడిందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్న ఎయిర్‌పోర్ట్ గడిచిన పదేళ్లుగా చేస్తున్న పోరాటం ఫలితంగానే వచ్చిందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి సహకరించడం శుభ పరిణామం అని అన్నారు. ఆదిలాబాద్ ఎయిర్‌ఫోర్స్‌తో పాటు విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి సహకరించడం శుభ పరిణామం అని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే భూసేకరణ, మౌలిక వస్తువుల ఏర్పాటు జరుగుతుందని, నరేంద్ర మోడీ ప్రత్యేకంగా ఆదిలాబాద్ జిల్లాపై దృష్టి సారించి, అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే జిల్లాకు రావాల్సిన కేంద్ర ప్రాజెక్టులు గతంలో రాలేదని, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే గెలిస్తే ఏమవుతుందని అన్న నాయకులకు ఎయిర్ ఫోర్స్, ఎయిర్ షిఫ్ట్ సమాధానం అని తెలిపారు. జిల్లా ప్రజల కల ఎయిర్ పోర్టు మంజూరు చేసినందుకు ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలి తప్ప.. ఆ తర్వాత పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. రాజకీయాల్లో ఆరో పణలు ప్రత్యారోపణలు సహజమని, వాటిని పక్కకు పెట్టి జిల్లా అభివృద్ధికి సహకరించాలన్నారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు అందరి కృషి ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ మంజూరు చేసిందని ఆయన అన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాజు, లాలా మున్నా, మయూర్ చంద్ర, నగేష్, జోగు రవి, దినేష్ మాటో లియా, రత్నాకర్ రెడ్డి, శ్రీనివాస్, సుభాష్, రాకేష్, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులసమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలి



**ఉట్నూర్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. ఉట్నూర్ మండలం చందోరి గ్రామానికి చెందిన పోసుబాయ్ తనకి ఏదైనా అంగన్వాడీ సెంటర్‌లో ఉద్యోగం కలిపించామని,తాండూర్ మండలం గోపాల్ నగర్ గ్రామానికి చెందిన గట్ల నర్సయ్య తనకి మేకల లోన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని,నేరదిగొండ మండలం కుంటాల గ్రామానికి చెందిన సిడం లక్ష్మి తనకు ఏదైనా ఆశ్రమా పాఠశాలలో ఆశ వర్కర్ ఉద్యోగం కల్పించామని కోరారు. పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పివో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎపిఓ ఏపీజీ మెస్రం, ఏఓ దామోదర స్వామి మనోహర్, ఈఈ తనజీ, పిహెచ్ఓ సందీప్, శ్యామల, డిపిఓ ప్రవీణ్ జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్ రాజు

**మంచిర్యాల, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

మాతాశిశు సంరక్షణ కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచాలని సిబ్బందికి డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్ రాజు సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని భగవంత్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య వైద్యాధికారి హరీశ్‌రాజు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యసేవల్లో మంచిర్యాల జిల్లా ముందుందని తెలిపారు. మాతాశిశు సంరక్షణ కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచాలని సూచించారు. వందశాతం టీకాలు ఇవ్వాలని, వ్యాధులు ప్రబలకుండ చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవికాలంలో వడదెబ్బ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. ఉపాధి హామీ పథకం పని ప్రదేశాల్లో, రేషన్ షాపుల దగ్గర ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో 60 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, మంచిర్యాల జిల్లా లీగల్ సోసైటీ మారం ఆర్పిత రెడ్డి, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత , జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వరి, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, వైద్యులు రాము, రజిత, అల్లాడి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పావని, పద్మ, సులోచన, ఐసీడీఎస్ సూపర్వైజర్, అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలు, గర్భిణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# నెన్నెల తహసీల్దార్ సస్పెండ్



**బెల్లంపల్లి, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల తహసీల్దార్ సబ్బ రమేష్ ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం సస్పెండ్ చేశారు. నెన్నెల మండలం చిన్న వెంకటాపూర్ గ్రామంలో ఒక పట్టా భూమిని పట్టాదారుకు తెలియకుండా ఆమె చనిపోయినట్లు సృష్టించి ఇతరులకు పట్టా చేయడంతో బాధిత పట్టాదారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ సబ్బ రమేష్ చేసిన అక్రమాలు వెలుగు చూశాయి. ఈ విషయంపై తహసీల్దార్ సబ్బ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ నాయబ్ తహసీల్దార్ ప్రకాష్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అక్రమాలకు సహకరించిన ధరణి ఆపరేటర్ ఉదయ్ ను విధుల నుంచి తొలగించి కైలాష్ అనే ఆపరేటర్‌ను నెన్నెల మండలానికి కేటాయించారు.



# మెరుగైన వైద్యసేవలందించాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి
- మాతా, శుశు సంరక్షణ ఆసుపత్రిలో తనిఖీల
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఏప్రిల్ 7 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలను అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మాత, శిశు సంరక్షణ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎస్ఎన్ సియు, పోస్ట్ ఆపరేషన్, ఇంజక్షన్ వార్డులను పరిశీలించి రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వైద్య చికిత్సలు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను సంఖ్యను పెంచాలని, ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి, నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అవుట్ పోస్ట్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై రోగులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆసుపత్రి వైద్యులు డా.సరోజ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



